అడెల్లి నందన వనంలో
వృక్షా బంధన్

- అటవీ శాఖ ఆధ్వర్యంలో సామూహికంగా మొక్కలు నాటిన విద్యార్థులు - 7లో



వినాయక చవితి.. హిందువుల తొలిపూజ. చిన్నారుల నుంచి పెద్దల వరకూ సందడిగా చేసుకునే పండుగ. ఈ నెల 27నుంచి ప్రారంభమయ్యే గణేశ్ ఉత్సవాలకు ప్రజలు సిద్ధం అవుతున్నారు. ఏకదంతుడు బహురూపాల్లో కొలువుదీరనున్నాడు. భక్తిగా పూజించే వినాయక విగ్రహాల విషయంలో పర్యావరణవేత్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మట్టి విగ్రహాలను పెట్టాలని సూచిస్తున్నారు. 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు వినాయక విగ్రహాలు వద్దు.. పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలు ముద్దు' అంటూ ప్రచారం చేస్తున్నారు. రంగుల విగ్రహాల తయారీకి ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇనుము, సింథటిక్ రంగులతో పాదరసం, క్రోమియం, సీసం, లెడ్ ఆర్సానిక్ తదితర విషపూరిత రసాయనాలను వాడుతున్నారు. వీటితో పర్యావరణానికి, జీవరాశులకు ప్రమాదం ఏర్పడుతుంది.



'ఎకో' దంతుడు

- పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలే ముద్దు
- ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలతో ప్రకృతికి చేటు
- రసాయనాలు, రంగులతో జీవ వైవిధ్యానికి విఘాతం
- అవగాహన కల్పిస్తున్నస్వచ్ఛంద సంస్థలు

మట్టి గణపతి.. మనసా స్మరామి

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఆదిలాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతులను ప్రతిష్ఠిస్తే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాం. వీటిలో కెమికల్స్ ఆర్టిఫిషియల్ రంగులు వాడకుండా మట్టితో తయారు చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. మట్టి గణపతులను సైతం వివిధ రూపాల్లో పెద్ద సైజ్‌లో కూడా తయారు చేసి విక్రయిస్తున్నారు. మట్టి గణపతుల తయారీలో ఎక్కువ ఫ్రెండ్లీ కలర్స్ వాడతారు. ఆకులు. పువ్వుల వల్ల ఈ రంగులు తయారవుతాయి. వీటి వల్ల ప్రమాదం ఏమి ఉండదు. చెరువు మట్టితో గణపతులను తయారు చేస్తున్నారు. మట్టి గణపతుల్లో సాధారణ స్థాయి నుంచి డెకోరేషన్ వినాయకులను కూడా విక్రయిస్తున్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి చెరువులో నిమజ్జనం చేయడం వల్ల కాలుష్య నివారణను అరికట్టడమే కాకుండా చెరువుల్లో పూడికతీసిన మట్టి పంటలకు ఎరువులుగా వినియోగించే అవకాశం ఉంటుంది. మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలు అవగాహన కల్పిస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ప్రమాదం..

వినాయకులను తయారు చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. నిప్పుకూ దహనం కాదు. దీనిలో ముడిపదార్థం జిప్సం. చెరువుల్లో, ఇతర నీటి వనరుల్లో ఈ విగ్రహాలను వేస్తాం. వాటి తయారీలో వాడే హానికారక రసాయనాలతో డయేరియా, చర్మవ్యాధులు సోకే ప్రమాదం ఉంది. తగరంతో చర్మ వ్యాధులు వస్తాయి. చర్మం రంగు మారుతుంది. స్కిన్ క్యాన్సర్‌కు ఆస్కారం ఉంది. ఆర్సానిక్ వల్ల తల వెంట్రుకలు ఊడతాయి. సీసం వల్ల కడుపునొప్పి వస్తుంది. శరీర పటుత్వం తగ్గుతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసిన నీటిని వినియోగిస్తే వ్యాధులు వచ్చే ఆస్కారం ఉంది. జల చరాలు, పశువులకూ ఆ నీటితో ముప్పే. అందుకే రసాయనాలతో చేసిన విగ్రహాలను తగ్గించాలంటున్నారు. రసాయనాల నీటిని పొలాలకు మళ్లిస్తే భూసారం తగ్గి భూమి సహజ స్వరూపాన్ని కోల్పోతుంది. మితిమీరిన శబ్దం, వాయు, పర్యావరణ కాలుష్యం వల్ల భవిష్యత్ తరాలకు మాత్రమే కాదు ప్రస్తుత

(మిగతా 6వ పేజీలో)



బజార్‌హత్నూర్ మండలం జాతర్లలో ఆదివాసీ మహిళ వేషధారణలో చిన్నారి

కదం తొక్కిన ఆదివాసీలు

- హాజరైన కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యాలు చేసిన ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఏఎస్పీ కాజల్ సింగ్
- గిరిజన భవన్ నుంచి ఆదివాసీల భారీ ర్యాలీ
- జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ఉట్నూర్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు



కలెక్టర్, ఎస్పీ, పీవో, ఏఎస్పీలకు గుస్సాడి నృత్యాలతో స్వాగతం పలుకుతూ..

ఉట్నూర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా జరిగింది. దీనిలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన్ భవన్ నుంచి జిల్లారాయిసెంటర్ అధ్యక్షుడు మేస్రం దుర్గుపటేల్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు, జిల్లా అధ్యక్షుడు పెందూరుదాదిరావుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల్పంచారు. అక్కడి నుంచి ర్యాలీ ద్వారా కొమురంభీం ప్రాంగణానికి చేరుకున్న అనంతరం జల్‌జంగల్‌జమీన్ కోసం పోరాటాలు చేసి ఆదివాసీల కోసం ప్రాణాలు అర్పించిన వీరుడు కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొమురంభీం ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్‌పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌లకు ఆదివాసీ గిరిజనులు గుస్సాడి నృత్యాలతో స్వాగతం పలికారు. కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన అతిథులు ముందుగా కొమురంభీం, రాంజీగోడు, బీర్సాముండా చిత్రపటాలకు పూజలు చేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా మేడి మేస్రం దుర్గుపటేల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రేలా నృత్యం చేయడంతో వారితో కలిసి ఐటీడీఏ పీవో, ఏఎస్పీలు నృత్యాలు చేశారు.



భీంపూర్‌లో భీం విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మూడేళ్లలో సాగునీరు : కలెక్టర్

జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ ఆధ్వర్యంలో కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉండగా 25వేల మంది గిరిజన రైతులు 80వేల ఎకరాల భూముల్లో సాగు చేస్తున్నారని, అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు కల్పించిన భూముల్లో తెలంగాణ ప్రభుత్వం రైతుల భూములకు సాగునీరు అందించడానికి సౌర గిరజల వికాసం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని వివరించారు. దేశవ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాకు మంచి గుర్తింపు వచ్చిందని రానున్న స్వాతంత్ర్య దినోత్సవ రోజున ఈ ప్రాంత ఆదివాసీ గిరిజనులు ఢిల్లీ వెళ్లి కార్యక్రమాల్లో పాల్గొననున్నారని అన్నారు. ఈ కార్యక్రమంల డీడీ అంబాజీ, ఏపీఓపీవీ టీజీ మేస్రం మనోహర్, ఆత్రం భుజంగరావు, సీడాం బాలేరావు, కుమ్ర విఠల్, అర్క వసంతరావు, ఆత్రం బాలేరావు, టేకం వసంతరావు, ముకుందరావు, భీమ్రావు, కుమురం వినాయకరావు, సిడాం సోనేరావు, మేస్రం భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ మహిళతో కలిసి నృత్యం చేస్తున్న పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్: మండలంలోని కేబీ కాంప్లెక్స్‌లో గ్రామీణ పేదల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ నాయక్, ప్రజా సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బానోత్ రామారావు, లంబాడా జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి బానోత్ జగన్‌నాయక్, జిల్లా నాయకులు జాదవ్ గణేష్ మహరాజ్, చవాన్ సురేష్ రాథోడ్ లాల్‌సింగ్, గడ్డం నకులుడు, కాంబ్లెబాబు, ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డీఎస్‌వో జిల్లా కార్యదర్శి నేతావత్ జైల్‌సింగ్, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

(మరిన్ని వివరాలు 7వ పేజీలో....)



ఆదిలాబాద్‌లో ఆదివాసీ సంఘాల నాయకుల కలిసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్: ఆదివాసీలు ఏళ్లుగా ఎదుర్కుంటున్న సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు.. హక్కులను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా పోరాడాల్సిన అవసరముందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు ఆదివాసీ సంఘాల నేతలు, పట్టణ ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక కొమురం భీం కాలనీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ గార్డెన్స్‌లో నిర్వహించిన సభలో భాగంగా ఆదివాసీ నృత్యాలు చేస్తూ వేడుకలు జరుపుకొన్నారు.

అలాగే ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాల విశిష్టత ప్రతీ ఒక్కరికి తెలియాలని, వారి సమస్యల పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం విశేష కృషి చేస్తుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ ఎదుట హీరాసుక్కా జాగృతి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పాల్గొనిన్నారు. ఆదివాసీ నేతలతో కలిసి కలెక్టర్, ఎస్పీలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.



నృత్యాలు చేస్తూ సందడి చేస్తున్న కలెక్టర్, ఎస్పీ



పొలాల పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

'పొలాల పండుగ'కు ఏర్పాట్లు

- 12న తాంసిలో జిల్లాస్థాయి సమావేశం

తాంసి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పొలాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మొదటిసారిగా నిర్వహించే ఈ పండుగను మండల కేంద్రమైన తాంసిలో ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. ఇందులో భాగంగా తాంసి గ్రామస్తులు పొలాల పండుగ నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. గ్రామస్థులే స్వచ్ఛందంగా తలకొంత పోగుచేసి పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లపొదలను తొలగిస్తున్నారు. ఈనెల 12న తాంసి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశానికి కలెక్టర్ రాజర్శి షా ఆదేశాలు జారీ చేశారు. 12న నిర్వహించనున్న సమావేశానికి పర్యాటకశాఖ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. మొత్తమీద రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్న పొలాల పండుగను తాంసీలో నిర్వహించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటికే ఏర్పాట్లకు కావాల్సిన పనులన్నీ చకచకా జరుగుతున్నాయి.

వేంకటేశ్వర ఆలయంలో అన్నదానం

జైనథ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరలోని శ్రీపద్మావతి ఆలవెలుమంగ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని దాతల సహకారంతో అన్నదానం ప్రారంభం కాగా, ఈ రోజు దాత కొంగల మల్లేష్ అన్నదానం వితరణ చేశారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గుడిపాటి రామాంజనేయులు ఈ సందర్భంగా తెలిపారు.

మది నిండగా.. రాఖీ పండగ

- జిల్లాలో తోబుట్టువుల ఆప్యాయతను చాటేలా సాగిన రాఖీ పౌర్ణమి వేడుకలు
- ప్రయాణికులతో కిటకిటలాడిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు



ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు రాఖీలు కడుతున్న సోదరిలు



నేరడిగొండలో రాఖీ సందర్భంగా అక్కాచెల్లెళ్లతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సెల్ఫీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలను చాటిచెప్పే రాఖీ పౌర్ణమి వేడుకలను జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో పౌర్ణమి రోజున రాఖి పండగను జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తుండగా.. ఆప్యాయతలను పంచె రాఖి పండగ సందర్భంగా అక్కలు, చెల్లెళ్లు తమ అన్నతమ్ముళ్లకు రాఖీలు కట్టి వారిపై తమకున్న ప్రేమానురాగాలను చాటుకున్నారు. రాఖీని కట్టుకున్న సోదరులు సోదరిమనులకు బహుమతులు అందించారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పాయల్ శంకర్ నివాసంలో పండగ సందడి నెలకొంది. ఎమ్మెల్యేకు ఆయన సోదరీమణులు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆయన తనయుడు బన్నీకి సోదరి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. అన్నచెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీకగా రక్షా బంధన్ నిలుస్తోందని అన్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం తోబుట్టువులకు మహిళలు రాఖీలు కట్టి ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. జీవితాంతం ప్రేమానురాగాలతో జీవించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మాజీ మంత్రి, బీ.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న నివాసంలో రాఖీ పండగను పురస్కరించుకుని కోలాహల వాతావరణం నెలకొంది. జోగు రామన్న సోదరీమణులు, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయ నిర్వాహకురాలు రేవతి బెహన్‌తో పాటు పలువురు ఆయనకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌కు ఆయన సోదరిలు రాఖీలు కట్టారు. ఆప్యాయతను పంచె రాఖీ పండగను ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. సోదర సోదరీమణుల మధ్య అనుబంధాన్ని పండగ చాటి చెపుతుందని తెలిపారు. అటు తెలంగాణ

(మరిన్ని వివరాలు 6వ పేజీలో....)



ఇచ్చోడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో రాఖీ సంబురాలు



బోథ్‌లో సీఐకి రాఖీలు కడుతున్న విద్యార్థులు



బజార్‌హత్నూర్‌లో రాఖీతో చిన్నారులు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన బోథ్ ఆత్మ చైర్మన్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలి

బోథ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సందర్భంగా బోథ్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించడం జరిగిందని ఆత్మ బ్లాక్ చైర్మన్ జి రాజు యాదవ్ పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లిన సందర్భంగా శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి కలవడం జరిగిందని అయితే ఈ సందర్భంగా బోథ్ రెవెన్యూ డివిజన్ ఆవశ్యకత గురించి వివరించామన్నారు. భవిష్యత్తులో మారుమూలన ఉన్న ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలంటే రెవెన్యూ డివిజన్ చేయాలని అంతేగాక గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలకు హామీ కూడా ఇవ్వడం జరిగిందని గురిచేసామన్నారు. ఆయన వెంట గ్రంథాల సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, తదితరులు ఉన్నారు.

ఆత్రం సుశీలకు ఉత్తమ పురస్కారం

బోథ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని బాబర గ్రామానికి చెందిన గణపతి మహిళా సంఘం సంఘం అధ్యక్షురాలు అత్రం సుశీల శనివారం మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరిగిన కార్యక్రమంలో అక్కడి అధికారులు ఉత్తమ పురస్కారం అవార్డు అందజేశారు. 'పచ్చదనం- గ్రామ పరిశుభ్రత' అంశంలో భాగంగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. గతంలోనూ రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డులను పొందారు. కాగా, శనివారం ఆదివాసి దినోత్సవం సందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేతుల మీదుగా భూపాల్‌లోని మానస భవనంలో ఆమెను అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డుతో ఆమె మొత్తం 22 అవార్డులు అందుకోవడం జరిగింది. గిరిజన బిడ్డ అంచలంచలుగా ఎదిగి అవార్డులు అందుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మది నిండగా.. రాఖీ పండుగ


గుడిహత్నూర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి


మాజీ ఎంపీపీకి రాఖీ కడుతున్న సహోదరి


బోథ్‌లో ఆర్టీసీ డ్రైవర్‌కు రాఖీ కడుతున్న బాలిక


మావలలో సోదరితో రాఖీ కట్టించుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

(5వ పేజీ తరువాయి...)

కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోరంచు ప్రశాంత్ రెడ్డికు వారి సోదరి రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు బీ.ఆర్.ఎస్ నాయకులు యూనుస్‌కి పలువురు పార్టీ మహిళా నాయకురాళ్లు రాఖీలు కట్టి మిటాయిలు తినిపించారు.

రిమ్స్ ఆసుపత్రిలో...

ఆదిలాబాద్ టౌన్ : జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రాఖీ పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌కు స్టాఫ్ నర్సులు, సిబ్బంది రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్చోడ : అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ అని ఐటీడీఏ జీసీడీవో మెస్రంఛాయా అన్నారు. శనివారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గిరిజనఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి రాఖీ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉత్తం పాల్గొన్నారు.

నేరడిగొండ : బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోదరిమణులతో కలిసి సెల్ఫీ దిగారు.

బజార్‌హత్నూర్ : శ్రీ సరస్వతి శిశు మందిర్‌ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు సామూహికంగా జరుపుకున్నారు.

మావల : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఘనంగా రాఖీ పండగ నిర్వహించారు. స్వీట్లు తినిపించుకొని రాఖీ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా ఆర్టీసీ బస్‌లలో ప్రయాణికులతో రద్దీగా మారింది.

బోథ్ : సోనాల గ్రామానికి చెందిన బోథ్ మండల మాజీ ఎంపీపీ తుల‌శ్రీనివాస్‌కు ఆయన సహోదరి రాఖీ పండుగ సందర్భంగా కేటీఆర్‌తో కలిసి ఉన్న శనివారం రోజున మాజీ ఎంపీపీ చేతికి కట్టారు. తన అక్క ఇంతటి ఆప్యాయతో కేటీఆర్‌తో కలిసి ఉన్న ఫోటో రాఖీ కట్టడం ఎంతో గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తనకు కేటీఆర్ పై ఉన్న అభిమానాన్ని గుర్తించి రాఖీని కట్టడం జరిగిందని పేర్కొన్నారు.

బోథ్ సీఐకి రాఖీ కడుతున్న విద్యార్థులు

మండలంలో శనివారం రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వారి తోబుట్టువులకు అన్న తమ్ముళ్లకు రాఖీలు కట్టి పండుగ ప్రాముఖ్యతను అనుబంధాన్ని చాటారు. సీఐ వెంకటేశ్వరరావు ఆర్టీసీ బస్ డ్రైవర్‌లకు వేదం పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టారు. మండల కేంద్రంలోని పలువురు వ్యాపారులు, రాజకీయ నాయకులకు వివిధ వర్గాల వారికి విద్యార్థులు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులున్నారు. బోథ్ మండల మాజీ జడ్పీటీసీ రాజనాల డాక్టర్ సంధ్యారాణి హరీష్ రావుకు రాఖీ పండుగ సందర్భంగా శనివారం రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో ఆస్పత్రి నిర్మాణానికి కృతజ్ఞతలు తెలిపారు.

‘ఎకో’ దంతుడు

(5వ పేజీ తరువాయి...)

మానవ జాతికి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

అన్నింటికీ మేలు..

మట్టి ప్రతిమలతో ఎలాంటి హానీ ఉండదు. ఇందులో సందేహానికి ఆస్కారం లేదు. ఖర్చు తక్కువే అవుతుంది. నీటిలో నిమజ్జనం తరువాత ప్రతిమలు కరిగిపోతాయి. రసాయనాలతో చేసిన ప్రతిమలతో పోలిస్తే మట్టి ప్రతిమలను తక్కువే వాడుతున్నారు. ఎంత అవగాహన కల్పిస్తున్నా మట్టి ప్రతిమల మండపాల సంఖ్య పెరగడం లేదు. మట్టి వినాయకులను బంకమట్టితో చేస్తారు. ఎలాంటి రంగులు పూయరు. దీంతో నీటి కాలుష్యం ఉండదు. కర్రలు, వరిగడ్డి, మట్టి ఇవన్నీ నీటిలో కరుగుతాయి. మళ్లీ ఎరువుగా తయారవుతాయి.

బాల గంగాధర తిలక్..

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆనాటి బ్రిటీష్ గవర్నర్ జనరల్ భారతీయుల వాక్ స్వాతంత్ర్యాన్ని కాలరాశారు. అప్పుడు సభలు, సమావేశాలకూ అనుమతుల్లేవ్. ఆ సమయంలో స్వాతంత్ర్యోద్యమ నాయకుడు బాల గంగాధర తిలక్ గణేశ్ ఉత్సవాలు, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవ పందిళ్ల దగ్గర పోగైన జనాలలో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను బలోపేతం చేసే విధంగా ప్రేరేపించారు.

మార్కండేయ మందిరంలో జంధ్యాల పౌర్ణిమ


భైంసాలో పూజలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

కుంటాల, ఆగస్టు 9 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు మార్కండేయ మందిరంలో శనివారం జంధ్యాల పౌర్ణిమను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలిలు నూతన శనివారం జంధ్యాలను ధరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గుద్దేటి గంగాధర్, కోశాధికారి సాయిరాం, మానేటి గంగాధర్, మచ్చ ప్రసాద్, శివకుమార్ ఉన్నారు.

భైంసా : పట్టణంలోని వినాయక్‌నగర్ కాల నీ పరిధిలోగల పద్మశాలి సంఘం కమ్యూనిటి హాల్‌లో శనివారం పద్మశాలి సంఘం సభ్యులు యజ్ఞోపవిత ధార ణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పద్మశాలి సంఘం భైంసా డివిజన్ అధ్యక్షులు సట్లవార్ మహేష్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మార్కండేయ చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణ వేద పండితులు ప్రకాష్ బేలే చేతుల మీదుగా కార్యక్రమం కొనసాగింది.

జిల్లా కేంద్రంలో ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నిర్మల్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంప్ కార్యాలయం వద్ద యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సమరసింహా రెడ్డి తెలిపారు. అనంతరం యువజన కాంగ్కెస్ జెండాను ఎగురవేసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ అర్షద్, జిల్లా ఉపాధ్యక్షులు దరశథ్ నిఖిల్, పట్టణ అశధ్యక్షులు నాయుడు సాయి ప్రతాప్, మండల అధ్యక్షులు షఫీక్, రితీష్, నవీద్, అడపా శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘బలవంతంగా కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు’


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

తలమడుగు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తలమడుగు మండల కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెప్పి బలవంతంగా పార్టీలో చేర్పించుకున్నారని బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మొట్టకిరణ్ ఆరోపించారు. శనివారం దేవపూర్‌లో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఇతర కొంతమంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మీ వ్యవసాయ పొలాలకు మట్టి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు కావాలంటే తమ నాయకునితో చెప్పి ఇప్పిస్తామని బలవంతగా కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పించారని ఆయన తెలిపారు. పథకాలు ఇప్పిస్తామని చెప్పి పార్టీలో జాయిన్ చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఇది వారి రాజకీయ దిగజారుడు తనానికి పరాకాష్ట అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, సీనియర్ నాయకులు ఎస్.కె అబ్దుల్లా, ఇతర టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

మావల ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని హరితవనం ముందున్న జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దేవ్రవ్వ(25), మారుతి(56), మంగావతి(35), నాగోబాయి(47) గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ కిషన్, పైలట్ ముజాఫర్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

రాజరాజేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్త జనం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, ఆగస్టు, 9 : (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శనివారం పురస్కరించుకొని కుంటాల మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్త జనం పోటెత్తింది. మండలం నలుమూలల నుంచి అధికసంఖ్యలో ప్రజలు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తాగు నీటితో పాటు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

మావల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై మావల పోలీసులు దాడి చేశారు. పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో చేతన్ అనే వ్యక్తి మహిళలతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గృహంను తనిఖీ చేయగా ముగ్గురు మహిళలను గుర్తించారు. ఈ మేరకు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకోని అరెస్టు చేసినట్లు మావల సిఐ స్వామి తెలిపారు.


ఖానాపూర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి


మాజీ మంత్రికి రాఖీ కడుతున్న తన సోదరీ

ఘనంగా రక్షాబంధన్

ఖానాపూర్/దిలావర్‌పూర్/నిర్మల్‌చైన్‌గేట్/సారంగాపూర్/ముథోల్/నిర్మల్‌రూరల్/కుంటాల/కుభీర్ : ఖానాపూర్ మండలంలో రాఖీపౌర్ణమి వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అన్నదమ్ముళ్లకు అక్కచెల్లెళ్లు రాఖీలను కట్టి మిఠాయిలను తినిపించారు. రాఖీల దుకాణాల వద్ద మహిళలు, చిన్నారుల సందడి కనిపించింది. అత్తింటి నుంచి పుట్టింటికి, పుట్టింటి నుంచి అత్తింటికి వెళ్లే మహిళతో ఏ వాహనం చూసినా జనంతో రద్దీగా కనిపించింది.

దిలావర్‌పూర్ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా చెప్పే రాఖీ పండుగ మండలంలో ఘనంగా జరిగింది. అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు పుట్టింటికొచ్చిన ఆడపడుచులతో పల్లెలన్నీ కళకళలాడాయి. ఆత్మీయ పలకరింపులతో పులకరించాయి. ఇళ్లన్నీ ఆడపడుచుల రాకతో సందడిగా మారాయి. చిన్ననాటి జ్ఞాపకాలను తమ పిల్లలతో కలిసి పంచుకున్నారు. గ్రామాలన్ని ఆడపడుచుల రాకతో కొత్త దనాన్ని సంతరించుకున్నాయి.

నిర్మల్ చైన్‌గేట్ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని శనివారం నిర్మల్ పట్టణంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తోబుట్టువులతో కలిసి జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అన్నారు. నియోజకవర్గంలో తనకు ఎంతో ప్రేమను పంచిన ప్రతి ఒక్కరికి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. తనను ఆదరించి ఆదరణ చూపుతున్న అక్క చెల్లెమ్మలకు ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోదరిమణులు, సోదరులకు రాఖీలను కట్టి స్వీట్లను పంచిపెట్టుకున్నారు. దీంతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది.

ముథోల్ : అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శిశు మందిర్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నిర్మల్ రూరల్ : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో వివేక్ నగర్ బస్తీలో ఘనంగా రక్షాబంధన్ ఉత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రఘునందన్ రెడ్డి, వక్త నారీ వినోద్ కుమార్, ఏబీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దేశభక్తిని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్ నగర కార్యవాహ కిన్నెర్ల రవి, నగర సహా వ్యవస్థ ప్రముఖ్ సుదర్శన్ చారి, రాజులదేవి గోవర్ధన్, ధీరజ్, నరేష్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల : మండలంలో రాఖీ పండుగను జరుపుకున్నారు. రాఖీ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి సైతం మహిళలు తరలివచ్చి రాఖీ కట్టారు. కల్లూరు కస్తుర్బా పాఠశాలలో విద్యార్థినిలు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాఖీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాఖీలను కట్టి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రక్షాబంధన్ ఆకృతిలో ముథోల్ శిశు మందిర్ విద్యార్థులు


దిలావర్‌పూర్‌లో సోదరులకు రాఖీలు కడుతున్న చెల్లెళ్లు

రాఖీ చిత్రం


రాఖీ పౌర్ణమి చిత్రం

ముథోల్ : మండలంలోని రాంటెక్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కవి, చిత్రకారుడు బసవ రాజు రాఖీ పౌర్ణమి సందర్భంగా అద్భుతమైన బోర్డు ఆర్ట్ చిత్రాన్ని సృష్టించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో అన్నాచెల్లెళ్ల బంధం, సోదరీ స్నేహం, రక్షాబంధన్ పండుగ సందేశాన్ని చక్కగా ప్రతిబింబించారు. ఆకుపచ్చ బ్లాక్ బోర్డుపై రంగురంగుల చాక్ ముక్కలతో ఈ చిత్రాన్ని గీశారు. చిత్రంలో చెల్లెలు తన అన్నకి రాఖీ కడుతున్న సన్నివేశాన్ని చిత్రీకరించారు. ‘హ్యాపీ రాఖీ’ అనే ఆంగ్ల శీర్షికతో పాటు ‘రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు’ అనే తెలుగు పదాలను అలంకార రీతిలో రాసి, పండుగ విశిష్టతను తెలియజేశారు. ఒక పక్క ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ మరోపక్క చిత్రకారుడిగా, కవిగా రాణిస్తున్నారు.

ఆదివాసీహక్కుల సాధనకు పోరాడుదాం

● ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో వక్తలు


భైంసాలో వేడుకలు నిర్వహిస్తున్న ప్రతినిధులు


ఖానాపూర్ కొమరం భీమ్‌చౌక్‌లో...

ఖానాపూర్/భైంసా/తానూర్/నిర్మల్‌రూరల్/దిలావర్‌పూర్/సారంగపూర్ ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసి హక్కులసాధన కోసం ఐక్యంగా పోరాడుదామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం ఖానాపూర్‌లోని తెలంగాణచౌక్, కొమ రం భీమ్ చౌరస్తాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఆదివాసి సంఘాలు, ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల జిల్లా నాయకుడు ఎం.అంకుష్ రావు, ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు నంది రామయ్య సహా పలువురు వక్తలు మాట్లాడారు. ఆదివాసి సంఘాలు, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు ఎం. లింగు, ఆత్రం రాజేశ్వర్, ఆత్రం భీమ్ రావు, పరశురాం, అశోక్, బారిక రావు, మోహన్, మారుతి, శంభు, దేవరావులున్నారు.

భైంసా : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో శనివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివాసీ నాయక్‌పోడ్ భైంసా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కుల దైవన్న భీమన్న చిత్ర పటానికి శోభయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు,కుమురం భీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆదివాసీ జెండాను ఎగురవేసి వేడుకలను సంబురంగా చేపట్టారు. ఆదివాసీ అమరవీరులను నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధు లు గురుడు సునీ ల్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నగరం దశరథ్, మక్కాజీ లక్ష్మణ్, పున్నేవార్ రామదాసులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి సమన్వయంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

తానూర్ : మండలంలోని ఝరి(బీ) గ్రామంలో శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా జరుకున్నారు. ఆదివాసం సంఘం నాయక్‌పోడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి కొమురంభీం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొమురంభీమ్ తెలంగాణ విముక్తి కోసం అసఫ్‌జాహీ రజవాసానికి వ్యతిరేఖంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడన్నారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సంఘం అధ్యక్షులు గణేష్, ప్రధాన కార్యదర్శి బంద్రోళ్ల సాయినాథ్, భూమన్న, కామటి విఠల్, పుండలిక్, గుర్ల యోగేష్, సాంబాజీ సంఘం యూత్ సభ్యులు శ్రీరామ్, సాయిప్రసాద్, ప్రద్యూమ్, ఓంకార్, దొంతుల రమేష్, మాజీ ఎంపీటీసీ శివదాస్, , తదితరులున్నారు.

నిర్మల్ రూరల్ : ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి వీరులు కొమురం భీమ్, రాంజీ గోండు, భారత మహా నాయకుడు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించినట్లు జిల్లా అధ్యక్షులు ముచ్చిండ్ల రవి కుమార్, ప్రధాన కార్యదర్శి అనుగొండ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘ సభ్యులు కస్తూరి భీమేశ్వర్, ఎస్. శివశంకర్, బాపయ్య, గుండంపల్లి సాయన్న, జి. సునీల్, పోశెట్టి, ముత్తన్న, బాలాజీ, గంపల భూమేష్, రాజేశ్వర్, శంకర్, పిరాజీ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : దిలావర్‌పూర్, న్యూలోలం, సాంగ్వి గ్రామాల్లో ఆదివాసి నాయక్‌పోడ్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసి జెండాలను ఆవిష్కరించారు. జల్, జంగల్, జమీన్ కోసం కొట్లాడిన కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిపెట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆదివాసి నాయకులు మంద మల్లేష్, వెంకగారి భూమయ్య, గోవిందుల మహేష్, తోట రమాకాంత్, జాన్ సత్య, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు కౌట్ల(బి), శాంతినగర్‌లో శనివారం ప్రపంచ ఆదివాసి దీనోత్సవ వేడుకలు ఆదివాసి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో కొమురంభీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివాసులు జెండాను ఎగరవేశారు.


సారంగాపూర్‌లో...


దిలావర్‌పూర్‌లో ఆదివాసి జెండాను ఆవిష్కరించిన నాయక్‌పోడ్‌లు



వరి పొలంలో ఎరువులను చల్లుతున్న రైతన్న

ఎరువుల ఘాటు.. చేనుకు చేటు

- యేటాటా పెరుగుతున్న వినియోగం
- సారాన్ని కోల్పోతున్న భూములు
- అనర్థదాయకంగా మారుతున్న అధిక వినియోగం
- నానో ఎరువులపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు

భైంసా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుబడి విధానంలో రసాయన ఎరువుల వినియోగం మితిమీరుతోంది. అధిక దిగుబడులు బాగా వస్తాయన్న ఉద్దేశంతో చాలా మంది రైతులు ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయి. భూములు సారవంతాన్ని కోల్పోయి నిస్సత్తువ స్థితికి చేరుకుంటున్నాయి. జిల్లా రైతాంగం ఎరువులను యథేచ్ఛగా వాడుతుండటంతో వినియోగం ప్రతి యేటా పెరుగుతూ పోతోంది. రెండేళ్ల కాల వ్యవధిలో 9 వేల మెట్రిక్ టన్నుల వినియోగం పెరిగిదంటే పరిస్థితి ఎంత వరకు చేరిందో చెప్పకుండానే తెలిసిపోతోంది. వినియోగ తీవ్రతకు అద్దం పడుతోంది.

● జిల్లాలో రెండు సీజన్లలో 7.56 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో వాన కాలం, యాసంగి కాలం కలిపి మొత్తం 7,56,060 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. 2024-25 సంవత్సరాలలో వానకాలంలో 4,32,203 ఎకరాల్లో , యాసంగిలో 3,23,857 ఎకరాలలో అన్నదాతలు పంటల సాగు చేశారు. రెండు సీజన్లకు సంబంధించి జిల్లా రైతాంగం మొత్తం 90,895 మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించారు.

● అధికమవుతున్న సాగు వ్యయం

అన్నదాతలు సాగుబడి విధానంలో మెళకువలు పాటించడాన్ని విస్మరిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు సైతం పాటించడం లేదు. ఫలితంగా సాగు వ్యయభారం అధికమవుతోంది.

● రెండేళ్లలో 9,053 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం పెరుగుదల

జిల్లాలో గత మూడేళ్లలో ఎరువుల వినియోగం గణాంకాలు పరిశీలిస్తే ఏ యేటాకాయేడు వినియోగం పెరుగుతోంది. 2022-23 సంవత్సరబలో 62,758 మెట్రిక్ టన్నుల యూరియా, 19,084 మెట్రిక్ టన్నుల డీఏపీ కలిపి మొత్తం 81,842 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం జరిగింది. ఇక 2023-24 సంవత్సరంలో 70,769 మెట్రిక్ టన్నుల యూరియా, 16,623 మెట్రిక్ టన్నుల డీఏపీ కలిపి 87,392 మెట్రిక్ టన్నుల వినియోగం జరిగింది. 2024-25 సంవత్సరములో 2022-23 సంవత్సరం వినియోగంతో పోల్చి చూస్తే 9,053 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం అధికమయింది. 2024 - 2025 సంవత్సరములో 71,724 మెట్రిక్ టన్నుల యూరియా, 19,171 మెట్రిక్ టన్నుల డీఏపీ కలిపి మొత్తం 90,895 మెట్రిక్ టన్నుల వినియోగం జరిగింది.

● మొక్కజొన్నలో మితిమీరుతున్న వినియోగం

జిల్లాలో మొక్కజొన్న పంట సాగులో ఎరువుల వినియోగం మితిమీరి పోతోంది. రైతన్నలు ఇష్టరాజ్యంగా సంబంధిత పంట సాగులో యూరియాను వినియోగిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచన ప్రకారం మొక్కజొన్న పంటకు ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాల వరకు యూరియా వినియోగించాల్సి ఉంది.

● నానో యూరియా వినియోగంపై రైతులు దృష్టి సారించాలి

(అంజీ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్)

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి అన్నదాతలు ప్రత్యామ్నా యం వైపు దృష్టి సారించాలి. ఇందు లో భాగంగా అన్ని విధాలుగా అధిక ప్రయోజనకరంగా ఉండే నానో యూరియా వినియోగంపై రైతులు దృష్టి సారించాలి. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులకు తోడ్పాటునిచ్చే నానో యూరియా వినియోగంతో లాభాలు ఎక్కువగా ఉంటాయి. పర్యావరణహితంతో పాటు పంటలకు అధిక సామర్థ్యం చేకూరనుంది. ద్రవ రూపంలో ఉండే నానో యూరియా పిచికారి సైతం సులభమైన రీతిలో చేపట్టవచ్చు. రైతులు తాము సాగు చేస్తున్న పంటల్లో కొద్దిమేరనైనా ప్రయోగాత్మకంగా నానో యూరియా వాడకం చేపట్టాలి.

మత సామరస్యానికి ప్రతీక రాఖీ పండుగ



రాఖీ కడుతున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కురన్నపేట్‌కు చెందిన శోభక్క శనివారం రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ ఏక్తా సంఘం అధ్యక్షుడు షేక్ ముజాహిద్‌కి రాఖీ కట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడు అందరికీ సహాయ సహకారాలు అందించాలని, ఎవరికైనా ఏ ఆపద ఉన్న ఆదుకోవాలని మంచి మనసున్న మనిషికి అక్కగా నేను గర్విస్తున్నానని తెలిపారు. షేక్ ముజాహిద్ మాట్లాడుతూ హిందూ సంస్కృతి ప్రకారం అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎప్పుడు ఇలానే ఉండాలని, రాఖీ మహాత్యాన్ని పెద్దలు, యువకులు తెలుసుకోవాలని, రాఖీ కట్టిన చెల్లెళ్లకు అక్కలకు ఎప్పుడు అండగా ప్రతి తమ్ముడు అండగా ఉండాలని అల్లాతో ప్రార్థిస్తున్నాని తెలిపారు.

అడెల్లి నందన వనంలో వృక్షాబంధన్



నందన వనంలో మొక్కలను నాటుతున్న దృశ్యం

సారంగాపూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఉన్నటువంటి నందన వనంలో శనివారం రక్షబంధన్‌ను పురష్కరించుకొని అటవీశాఖ అధ్వర్యంలో వృక్షబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో నందన వనంలో అటవీశాఖ అధికారులు పాఠశాల విద్యార్థులు సామూహికంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి నజీర్‌ఖాన్ మాట్లాడారు. ప్రకృతితో అనుబంధం వృక్షముతో ప్రేమానుబంధం అని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. ఈ వృక్ష బంధన్ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ అది, అటవీశాఖ అధికారులు ఉన్నారు.



ఉట్నూర్‌లోని కొంరంభీం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా మేడి మేస్రం దుర్గుపటేల్



ఉట్నూర్‌లో ఆదివాసీ మహిళల రేలా నృత్యం



జెండా ఎగుర వేస్తున్న దృశ్యం

కదం తొక్కిన ఆదివాసీలు..

- ఆదిలాబాద్ జిల్లాలో అట్టహాసంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌రూరల్ మండలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లింగుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. ఆదివాసుల వెనుకబాటు తనంపై అందరు ఒక్కటై పోరాటం చేయాలని, ఆదివాసుల అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుంటు పోవాలని అన్నారు. ఆదివాసీ ప్రజ లు తమ హక్కులను కాపాడుకోవడానికి సాంస్కృతి సంప్రదాయాలను నిలబెట్టడానికి అందరు కలిసి కట్టుగా పోరాడాలని తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను ప్రభుత్వమే గనంగా నిర్ణయించాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీపీ జంగుపటేల్, రాయిసెంటర్ పెద్దలు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మార్కెట్ గల్లీ, సోనార్‌గల్లీ మీదుగా బారీఎత్తున నినాదాలు చేస్తూ సంప్రాదాయ వాయిద్యాల నడుమ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఆత్రం మహెందర్, కొ డప నగేష్, మురళీ, కాత్లే శ్రీధర్, ఉయికే సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

బజార్‌హత్నూర్: ఆదివాసీ ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునే నైతిక బాధ్యతల అందరి పై ఉందని ఆదివాసీ పటేల్ భీంరావ్, గేడం భీంరావులు అన్నారు. మండలంలోని జాతర్ల, మాడగూడ, చిన్నహత్నూర్, అనంతపూర్, చింతల సాంగ్వి గ్రామాల్లో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో డోల్, డబ్బులు, పెప్రి, వాయిద్యాల నడుమ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మడావికృష్ణ, నాగోరావ్, మడావిబలిరాం, ఈశ్వర్, భూమన్న, హన్మంతు, జగదీశ్, సుభాష్‌నాందేవ్ పాల్గొన్నారు.

గోండు గూడలను గ్రామ పంచాయితీలు చేసిన ఘనత కేసీఆర్‌దే

భీంపూర్: గోండుగూడలను గ్రామ పంచాయితీలుగా చేసి అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆయన శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్స వం సందర్భంగా భీంపూర్ మండల కేంద్రంలో ఏ ర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కుంరా సుధాకర్, గడ్డం లస్మన్న, కుడి మేత సంతోష్, ప్రముఖ న్యాయవాది కేమ శ్రీకాంత్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకుంటూ మన పిల్లలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెస్రం నాగోరావు, మాజీ సర్పంచ్ మడావి లింబాజి, ఆదివాసీ నాయకులు సీడం పురుషోత్తం, పాండురంగ్, మడావి వినోద్, రామేశ్వర్, సీడం అశోక్, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ యాదవ్, మోటే కిరణ్, తిరుమలగౌడ్, రవీందర్ జాదవ్, రాథోడ్ ఉత్తమ్, గుర్ల నరేందర్ యాదవ్, షేక్ అఫ్రోజ్ పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కుంరం భీం రాంజీ గోండు చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఆదివాసి జెండా ఎగుర వేశారు. ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ మా ట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యారాజ్య సమితి సూచన లు పాటిస్తూ ఆదివాసుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు పెందోర్ విశ్వనాథ్, ఆదివాసి సేన మండల అధ్యక్షుడు సేడ్మకి భీంరావ్, జిల్లా కోశాధికారి ఉయిక శ్యాంరావ్, కోట్నక్ గణేష్, వేడ్మ చంపత్ రావ్, కుంర చత్రుఘన్ పాల్గోన్నారు.

కుమురం భీమ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గఇన్‌చార్జి ఆడె గజేందర్

నేరడిగొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కొమురం భీమ్ భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురం భీంను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాల్లోని ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుక్షణం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ గోండ్ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు ఆత్రం సోనేరావు, అధ్యక్షుడు ఆత్రం నాగేష్, ఉపాధ్యక్షులు గోడం అమృత్, ప్రధాన కార్యదర్శి జగన్ ప్రకాష్, సంయుక్త కార్యదర్శి దుర్వ లాలూ రాం పాల్గొన్నారు.



ఆదివాసీ సంస్కృతిని చాటేలా నిర్వహిస్తున్న ర్యాలీ

తలమడుగు: ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శనివారం తలమడుగు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివాసి సంఘాల నాయకులు తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, మండల కేంద్రంలో కుమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రామంలో డివిజన్ అధ్యక్షులు కొమురు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి భుజంగరావు, కోశాధికారి అశోక్, గ్రామ పటేల్ ధర్‌ము భీమ్రావు ప్రభాకర్, మాల సంక్షేమ సంఘం నాయకులు గంగన్న పాల్గొన్నారు.

కుమురం భీమ్ ఆశయాలకు అనుగుణంగా కలిసి పోరాడుదాం

బోథ్: కుమురం భీమ్ ఆశయాల కనుగుణంగా పనిచేద్దామని ఆయన చూపించిన మార్గంలో కలసి హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఆదివాసి నాయకులు పేర్కొన్నారు. సోనాల బోథ్ మండల కేంద్రాల్లో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అయా గ్రామాలలో ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించి కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన పోరాటాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షులు పంద్రం శంకర్, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ మండలం జాతర్లలో నృత్యాలు చేస్తున్న దృశ్యం



ఆదివాసీ దినోత్సవంలో ఆడె గజేందర్



ఆదిలాబాద్ తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న అతిథులు..

చినుకు రాలదు.. చింత తీరదు

- ఎండుతున్న పంటలు
- వర్షం కోసం రైతుల ఎదురు చూపులు

తాంసి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పత్తి విత్తనాలు నాటి నేటికి సరిగ్గా రెండు మాసాలు కావస్తుంది. కానీ ఆశించిన స్థాయిలో మాత్రం పంటలు పెరగలేకపోతున్నాయి. మొదట్లో వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ గత పక్షం రోజులుగా వర్షాలు మొహం చాటేసాయి. పెరిగే సమయంలోనే వర్షాలు కురియకపోవడంతో పత్తి పంట ఆశించిన స్థాయిలో పెరగడం లేదని రైతులు అంటున్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల 50 వేల ఎకరాలలో పత్తి పంట ను సాగు చేస్తున్నారు. అయితే ఏ ప్రాంతంలో కూడా సమృద్ధిగా వర్షాలు కురియడం లేవు. ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి, రెండు వారాలలో మూడున్నర నుంచి నాలుగు పీట్ల వరకు పత్తి పెరిగేది. కానీ ప్రస్తుతం పీటున్నర కూడా లేదు అంటే అందులో ఎలాంటి అతిశ యోక్తి లేదు. దీంతో తమకు ఈ ఏడు కష్టాలు ఎదురు కావచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఎండుతున్న సోయా పంట

పత్తి పంట పరిస్థితి అలా ఉంటే సోయకు ప్రస్తుతం పూత సమయం. తప్పనిసరిగా బలమైన వర్షం కావాల్సి ఉంటుంది. కానీ వర్షం లేని కారణంగా సోయా పంట సైతం ఎండుబారి పో తుందని రైతులు అంటున్నారు. అప్పుడే మేఘాలు మబ్బులు వాలుతున్నాయి. అప్పుడే ఎండ... అప్పుడే ఉక్కపోతతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సోయ పంట సైతం చేతికి వచ్చేలా కనిపించడం లేదని, ఒకవేళ వచ్చిన పూర్తిగా దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.



పంటకు నీళ్ళు పెట్టేందుకు స్పింకర్లను బాగు చేసుకుంటున్న రైతు

● దిగుబడులు తగ్గే అవకాశాలు

మరో వారం రోజుల్లో కనుక వర్షాలు కురియకపోతే ఈసారి దిగుబడులు కష్టమేనని రైతులు అంటున్నారు. వర్షం కోసం ప్రతి గ్రామంలో పూజలు చేస్తున్నారు. అయినా వరుణుడు కరుణించకపోవడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. పత్తి పంటతో పాటు సోయాపంట దిగుబడులు సైతం గణనీయంగా తగ్గే అవకాశాలు లేకపోలేదు. గత సంవత్సరం పత్తి పంట ఎకరానికి ఇంచుమించుగా ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సోయా విషయానికి వస్తే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం పరిస్థితులు చూస్తే దిగుబడులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.



పత్తి పంటకు నీళ్ళు ఇస్తున్న దృశ్యం

● అప్పుడే తెగుళ్లు

అసలే పంటలు పెరుగక ఆందోళన చెందుతున్న రైతులకు పంటలపై అప్పుడే తెగుల ప్రభావం తీవ్రమైంది. ఇప్పటి వరకు ఎకరానికి సుమారు రూ.20 వేల నుంచి 25 వేలు ఖర్చు చేశారు. పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందో రాదో అనుకుంటున్నా సమయంలోనే ఈ తెగుళ్లు మరింత అన్నదాతను ఆవేదనకు గురి చేస్తున్నాయి. పత్తి పంటకు పేనుబంక, చీడ, గులాబి రంగు పురుగు ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి భక్త నీరాజనం

- కాల్వలకు పోటెత్తిన భక్తులు



కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దిలావర్‌పూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కోరిన వారి కొంగు బంగారమై వరాలనొసగే శ్రీ కాల్వ నరసింహ స్వామికి శనివారం భక్తులు నీరాజనం పట్టారు. మూడవ శ్రావణ శనివారం, అందులోను పౌర్ణమి కలిసి రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. అష్టముఖి కోనేరులో పవిత్ర స్నానాలు చేశారు. స్వామివారి దర్శన భాగ్యం కోసం గంటల తరబడి బారులు తీరారు. దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నరసింహ స్వామికి కొబ్బరికాయలు కొట్టి, పప్పు బెల్లం నైవేద్యంగా సమర్పించారు. లక్ష్మీ నరసింహ స్వామివారి నామస్మరణతో కాల్వ అడవులు మార్మోగాయి. స్వామివారి చెంతనే కొలువైన ధ్యాన హనుమాన్ స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దిలావర్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం చైర్మన్ అంగూర్ మహేందర్, ధర్మకర్తలు పూదరి శివ కుమార్, జి. నర్సారెడ్డి, గుమ్ముల చిన్న నర్సయ్య, జి. దేవేందర్, శ్రీకాంత్, కాశీనాథ్, సాయి, లక్ష్మణ్, నవీన్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్, కాల్వ మాజీ సర్పంచ్ ఇప్ప నర్సారెడ్డి, గంగాధర్, తదితరులు స్వయంగా భక్తులకు సేవలందించారు. దిలావర్‌పూర్ మాజీ సర్పంచ్ గంగాధర్ దంపతులు మహా అన్నప్రసాద వితరణ చేశారు.

సోనాల మండల కేంద్రంలో.. పశువైద్యశాలను నిర్మించండి

బోథ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల మండల కేంద్రంలో పశువైద్యశాల కూలిపోయే విధంగా ఉందని నూతనంగా పశు వైద్యశాలను నిర్మించాలని గ్రామానికి చెందిన విషయాలు సింగ్ జవాన్ అనే యువకుడు జిల్లా కలెక్టర్ విన్నవించారు సరైన వసతులు లేకపోవడంతో విధులు నిర్వహించే సిబ్బంది ఇబ్బందులు గురవుతున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేగాక ప్రస్తుతం విధంగా నిర్వహిస్తున్న సిబ్బందికి మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారులు తక్షణమే సందించి మూగజీవాలకు వైద్యం అందే విధంగా చూడాలని కోరారు.

● సోనాల బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక ప్రయాణికులకు తప్పని తిప్పలు

నూతనంగా ఏర్పాటైన సోనాల మండల కేంద్రంలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామం మీదుగా ప్రతిరోజు మహారాష్ట్ర, ఇచ్చోడ వైపు వెళ్లే ప్రయాణికులు వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అయితే మూత్రశాల లేకపోవడంతో ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో బస్టాండ్ వద్ద నిర్మించిన మూత్రశాలలు రోడ్డు వెడల్పు సమయంలో కూల్చి వేయడం జరిగింది. ఆ తర్వాత మూత్రశాల నిర్మాణం జరగలేదు.

● దాతలు ముందుకు రావాల్సి ఉంది

- గ్రామ యువకుడు హరీష్



మండల కేంద్రంలో ప్రయాణికుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని దాతలు ఎవరైనా ముందుకు వచ్చి మూత్రశాలలు నిర్మించి ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు గ్రామం నుంచి జిల్లా రాష్ట్ర స్థాయికి ఎదిగిన నాయకులు ఎందరో ఉన్నారు అయితే వారు ప్రభుత్వ పరంగా నైనా తమకున్న పరిచాలతో బస్టాండులో మూత్రశాలలు నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లా అధికారులైన చర్యలు తీసుకోవాలి. మరుగుదొడ్ల నిర్మాణం పై జిల్లా అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు

సోనాల మండల కేంద్రంలో మరుగు దొడ్లు లేని పరిస్థితి వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. మహారాష్ట్ర సరిహద్దుకు అతి సమీపంలో ఉండే సోనాల గ్రామం ద్వారా రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ మార్గంలో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం బాధాకరమని స్థానిక యువ నాయకుడు కచ్చకాయల హరీష్ తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ ప్రతి పల్లె పల్లెకు టాయిలెట్ల నిర్మాణం చేసినట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. కానీ మండల కేంద్రంలోనే మరుగు దొడ్లు లేకుండా ఉన్న పరిస్థితి చాలా దురదృష్టకరం. ముఖ్యంగా మహిళలకు ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. రోజూ ప్రయాణించే మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులను కోరినా స్పందన లేకపోవడంతో, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఇది ఊరినే కాదు, మండల కేంద్రం ప్రతిష్ఠను దెబ్బతీసే పరిస్థితి అని ఆయన వ్యాఖ్యానించారు.

బుద్ధుని భోదనలు అనుసరనీయం : దీపరత్న

తానూర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బుద్ధుని బోధనలు అనుసరనీయం అని పూజ్జ బంతే దీపరత్న అన్నారు. శనివారం మండలంలోకి ఎల్వత్ గ్రామంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో వర్షావాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలను దూరంగా ఉంటూ వైజ్ఞానిక మార్గంలో ముందుకు నడవాలన్నారు. ఆ తర్వాత బస్టాండ్ నుంచి బుద్ధవిహార్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రభాకర్ గడ్‌పాలే, జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, గంగాధర్, ఆయా గ్రామాల కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


భైంసాలో పాటిల్‌కు రాఖీ కడుతున్న సోదరి శాంతబాయి

సంప్రదాయబద్ధంగా రక్షా బంధన్

భైంసా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం రక్షా బంధన్ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తమ సోదరులకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించాలని సోదరిమణులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అక్కడే తమ వెంట తీసుకవచ్చిన రాఖీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ ఇళ్లకు వెళ్లి సోదరులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా స్థానిక వీహెచ్‌పీ ప్రతినిధులు, హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, శ్రీసరస్వతీ శిశుమందిర్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పట్టణంలో పర్యటించి ప్రయాణికులకు, ఆసుపత్రిలోని రోగులకు, పోలీసులకు, వ్యాపారస్తులకు రాఖీలు కడుతూ శుభాకాంక్షలు తెలియచేశారు. ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌కు ఆయన సోదరి శాంతబాయి. ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్‌లకు సోదరి తారాబాయి రాఖీలు కట్టి దీవెనలు అందచేశారు.

కడెం ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో

కడెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట్, హాజీపూర్ మండలాల రైతుల వరప్రదాయిని కడెం ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో 1,707 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.200లు ఉందన్నారు. లెఫ్ట్, రైట్ కెనాల్ ద్వారా మిషన్ భగీరథకు మొత్తం కలిపి 905 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా, కడెం ప్రాజెక్టుపై గల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


గుంతలమయంగా మారిన కడెం ప్రాజెక్టు రోడ్డు

“ జిల్లాలో చేపపిల్లల పెంపకంపై.. నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. వర్షాకాలం మొదలై దాదాపు రెండు నెలలు పూర్తవుతున్నప్పటికీ.. ఇప్పటి వరకు జలాశయాల్లో చేప పిల్లలను విడుదల చేయకపోవడం మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రతియేటా ఈ సమయానికే ప్రాజెక్టుల్లోని రిజర్వాయర్‌లతో పాటు చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేవారు. అయితే గత ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా అప్పట్లో చేప పిల్లలను పంపిణీ చేసిన గుత్తేదారులకు సక్రమంగా బిల్లులు చెల్లించని కారణంగానే ఆ వ్యవహారం ఈసారి టెండర్ ప్రక్రియకు ఆటంకంగా మారిందంటున్నారు. ”



చేప పిల్లల పెంపకంపై.. నీలి నీడలు!

- ఆందోళనలో మత్స్యకారుల కుటుంబాలు
- గాలిలోనే ఉపాధి ఆశలు
- ఇప్పటి వరకు జలాశయాల్లో మొదలుకాని చేపపిల్లల విడుదల
- సీజన్ మొదలై రెండు నెలలు గడుస్తున్నా.. పట్టింపు కరువు
- జిల్లాలోని 14 వేల మత్స్యకారుల కుటుంబాలు

నిర్మల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మొదట అధికారులు జిల్లాలోని ఐదు ప్రాజెక్టులతో పాటు 545 చెరువుల్లో చేప పిల్లలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం గానూ 4.74 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని ప్రతిపాదించారు. గత ఏప్రిల్ నెలలోనే ఈ ప్రతిపాదనను సర్కారుకు అందించారు. సాధారణంగా ప్రతియేటా ఏప్రిల్ నెలలోనే చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం టెండర్ ప్రక్రియను నిర్వహిస్తుంటుంది. గత బిల్లుల బకాయిలు, చేప పిల్లలను పంపిణీ చేసే గుత్తేదారుల వ్యవహారం తో ఈసారి టెండర్ ప్రక్రియకు ఆటంకాలు ఎదురయ్యాయి. అంతేకాకుండా సంబంధిత మత్స్య అభివృద్ధి శాఖ టెండర్ ప్రక్రియను నిర్వహించేందుకు సిద్ధమైనప్పటికీ. ప్రక్రియ కు ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిపోయింది. వర్షకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ.. ఒక్క జలాశయంలో కూడా చేప పిల్లలను వదలకపోవడంతో జిల్లాలోని మత్స్యకారుల కుటుంబాలన్ని తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ప్రతి యేటా ప్రభుత్వం మత్స్యకారుల ఉపాధి కోసం ఈ చేప పిల్లలను ఉచితంగానే పంపిణీ చేస్తోంది. అయితే జలాశయాల్లో చేప పిల్లలను ఆలస్యంగా వదిలితే అవి వాటి ఎదుగుదలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆశించిన మేరకు దిగుబడి రాకపోవచ్చని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆగస్టు చివరి వరకు ప్రాజెక్టుల్లో చేపల వేటపై నిషేదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రిజర్వాయర్‌లు, చెరువుల్లో ఉన్న చేపలు మరింతగా పెరిగేందుకే కాకుండా ఈ రెండు నెలల్లో కొత్తగా వదిలే చేపలు రిజర్వాయర్‌లలో సురక్షితం గా ఉండేందు కోసం చేపల వేటపై నిషేధాన్ని విధించారు. అయితే చేపల వేటపై నిషేదం గడువు ముగియబోతున్నప్పటికీ.. ఇప్పటి వరకు చేప పిల్లల విడుదల విషయంపై స్పష్టత రావడం లేదు. మరో 20 రోజులు గడిస్తే చేప పిల్లలను జలాశయాల్లో వదిలినప్పటికి వాటి ఎదుగుదల సకాలంలో ఉండదని ఇదే జరిగితే జిల్లాలోని 14వేల మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


చెరువులు, వాగుల్లో చేపలు పడుతున్న మత్స్యకారులు

ఐదు ప్రాజెక్టులు.. 545 చెరువులు

నిర్మల్ జిల్లాలోని కడెం, గడ్డెన్న వాగు, స్వర్ణ ప్రాజెక్టు, సదర్‌మాట్, జిల్లాకు అనుకొని ఉన్న ఎస్సారెస్పీ, సదర్‌మాతో పాటు 545 చెరువులున్నట్లు మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ చెరువులన్నీ చేపల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుండడంతో ప్రతియేటా లక్షలాది చేప పిల్లలను వీటిలో వదులుతున్నారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో మత్స్యకారులకు సబ్సిడీ పై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. అయితే గత కొంతకాలం నుంచి ప్రభుత్వం చేప పిల్లల పంపిణీని పూర్తిగా ఉచితంగా చేపడుతోంది. అదేవిధంగా చేప పిల్లల కొనుగోలు ప్రక్రియ నుంచి వాటిని ప్రాజెక్టులు, చెరువుల వద్దకు చేర్చేందు కోసం రవాణా వ్యయాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోంది. దీనికి సంబంధించి ప్రతియేటా ఏప్రిల్ నెలలోనే టెండర్ ప్రక్రియను నిర్వహిస్తోంది. చేప పిల్లల పెంపకందారులు ఈ టెండర్‌లలో పాల్గొని జిల్లాకు వాటిని రవాణా చేసేవారు. అయితే నిధుల కొరత కారణంగా గత రెండేళ్ళ నుంచి ఈ ప్రక్రియ కు ఆటం కాలు ఎదురవుతున్నాయి. గతంలో చేప పిల్లల నాణ్యతతో పాటు వాటి సైజు విషయంలో కూడా గుత్తేదారులు అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో వారికి ప్రభుత్వం విచారణ పేరిట సకాలంలో బిల్లులు చెల్లించలేదు. అయితే గుత్తేదారులు తమ బిల్లుల బకాయిల పేరిట ఈ సారి టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు ముందుకు వచ్చే అవకాశాలు లేని కారణంగా ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ వ్యవహారంలో జాప్యం చేస్తుందన్న ప్రచారం జరుగుతోంది.

14వేల కుటుంబాల ఉపాధిపై ప్రభావం

జిల్లాలో మొత్తం 222 మత్స్య సహకార సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో సుమారు 13,500 మంది మత్స్యకారులు సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరితో పాటు సహకార సంఘాల్లో సభ్యత్వం లేని మరో 500 కుటుంబాలు కూడా చెరువుల్లో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రతియేటా ప్రభుత్వం పంపిణీ చేసే చేప పిల్లలను ప్రాజెక్టులు, చెరువుల్లో పెరగనుండగా.. వాటిని వేటాడి మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. అయితే ఈ సారి వర్షకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ.. ఇప్పటి వరకు చేప పిల్లలను వదలకపోవడంతో భవిష్యత్‌లో తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా యుద్ధప్రతిపాదికన చేప పిల్లలను పంపిణీ చేపట్టాలని, అంతేకాకుండా వాటిని జలాశయాల్లో విడుదల చేసినట్లయితే ఆలస్యంగానైనా తమకు ఉపాధి లభించే అవకాశాలుంటాయని మత్స్యకారులు కోరుతున్నారు.

సోదరితో రాఖీ కట్టించుకుని..

తిరిగి వస్తూ సోదరుడి మృతి

- పండుగ పూట విషాదం
- కంటైనర్ వాహనాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనం
- మరో వ్యక్తికి స్వల్ప గాయాలు
- నిజామాబాద్ జిల్లాలో ప్రమాదం


జగ్గారావుఫారం వద్ద ప్రమాద దృశ్యం


మృతుడు సాయిబాబు(ఫైల్)

నవీపేట/బాసర, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ రోజున విషాదం జరిగింది. తన సోదరితో రాఖీ కట్టించుకోవడానికి నిజామాబాద్ వెళ్లిన యువకుడు తిరిగి తన స్వగ్రామానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయిబాబు అలియాస్ బబ్లూ(19) శనివారం రోజున రాఖీ పండుగను పురస్కరించుకుని నిజామాబాద్‌లోని గాజులపేట్‌లో ఉంటున్న తన అక్క ఇంటికి తన స్నేహితుడు అరవింద్‌తో కలిసి స్కూటీపై వెళ్లాడు. అక్కతో రాఖీ కట్టించుకుని తిరిగి తన స్నేహితుడితో కలిసి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావుఫారం సమీపంలో ముందుగా వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన స్కూటీ ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న సాయిబాబు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న అరవింద్‌కు స్వల్ప గాయాలు కాగా 108వాహనంలో చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాఖీ పండుగ రోజున తన సోదరితో రాఖీ కట్టించుకుని తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో సాయిబాబు మృతి చెందడం స్థానికులను కలిచివేసింది. సాయిబాబు బాసర సరస్వతిదేవి ఆలయం సమీపంలో ఉన్న ఒక దుకాణంలో పని చేసేవాడు. తండ్రి వ్యవసాయం చేస్తుండగా, తల్లి బీడీ కార్మికురాలు. సాయిబాబు మేనమామ బలగం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పోలీసులు సాయిబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


బాసరలో మృతుడి ఇంటి బంధువులు


..రోదిస్తున్న మృతుడి తల్లి

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

నిర్మల్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల గ్రామం వద్ద శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... లోకేశ్వరం మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన మహేష్ తన పెద్దమ్మ కూతుళ్లు అయిన రాయపూర్ కాండ్లికి చెందిన అర్చన, ఆద్యలతో కలిసి బయలుదేరి జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో ఉన్న తన చెల్లెలు వద్దకు రాఖీ కట్టించుకోవడానికి వస్తుండగా మార్గమధ్యలో చిట్యాల గ్రామం సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో వారిలో మహేష్‌కు, అర్చనకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన పట్టణంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు వారిని తరలించినట్లు తెలిపారు. వీరిలో ఆద్యకు ఎలాంటి గాయాలు కాలేవని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేయాలి

- ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


నిర్మల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

నిర్మల్‌టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) :ప్రపంచఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలో ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీల హక్కులను కాపాడాలని, వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. టీఎన్జీవో భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ విగ్రహం మీదుగా కొమురం భీమ్, రాంజీ గోండు విగ్రహాల వరకు సాగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం టీఎన్జీవో భవనంలో జరిగిన సభలో నాయకులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మందమల్లేష్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ... ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేం ద్రంలో ఆదివాసి మ్యూజియం ఏర్పాటు చేయాలని, ఆదివాసి విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్‌సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శంభు, నైత భీమ్‌రావు, టి.గోవర్ధన్, చుంచు శ్రీనివాస్, సాకి లక్ష్మణ్, సూరపు సాయన్న, నాయ కపోడ్ సంఘం అధ్యక్షులు శంకర్, ఉద్యోగుల సంగం అధ్యక్షులు రవి, కార్యదర్శి సతీష్, ఎల్లయ్య, పోతురాజ్ శ్రీనివాస్, భీమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల డబుల్స్‌లో ప్రతిభ


మెడల్స్, సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులు

నిర్మల్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 2 నుంచి 7 వరకు ముంబైలో జరిగిన అండర్- 13 జీడీ జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్ బాలికల డబుల్స్‌లో బంగారు పతకాన్ని అనుముల అమర్‌కుమార్ లావణ్య దంపతుల కుమార్తె వైభవి సాధించిందని కరస్పాండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉన్నతపాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ రాణి అభినందించారు.

నిర్మల్ కేంద్రంలోనే

కోర్టు కాంప్లెక్స్ నిర్మించండి

- ముథోల్ రాజకీయ పార్టీలకు బార్ అసోసియేషన్ల విజ్ఞప్తి
- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాల అందజేత
- బహిరంగ మద్దతు ప్రకటించిన పార్టీలు


ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జికి సభ్యుల వినతి


బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధికి..

భైంసా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్మించే కోర్టు కాంప్లెక్స్ భవన సముదాయాన్ని సుదూర ప్రాంతంలో కాకుండా నిర్మల్ కేంద్రంలోనే జరిగే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకవచ్చేలా చర్యలు చేపట్టాలని ముథోల్ నియోజకవర్గ ప్రధాన రాజకీయ పార్టీలకు జిల్లా బార్ అసోసియేషన్లు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు శనివారం నిర్మల్, భైంసా బార్ అసోసియేషన్ల అధ్యక్షులు అలూరి మల్లారెడ్డి, సి.శంకర్‌ల నేతృత్వంలో సభ్యుల బృందం ఇక్కడి డివిజన్ పరిధిలో పర్యటించింది. భైంసాలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ (బీజేపీ), మాజీఎమ్మెల్యేలు బోస్లే నారాయణ రావ్ పాటిల్ (కాంగ్రెస్), మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి (కాంగ్రెస్), బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్‌లను కలిసి సంబంధిత విషయంలో మాట్లాడి పరిస్థితిని వివరించారు. వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలూరి మల్లారెడ్డి ముథోల్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాన్ని జిల్లా కేంద్రానికి సుదూరంలోనున్న ఆదిలాబాద్ రోడ్డుమార్గంలోని మహిళా ప్రాంగణలో కాకుండా నిర్మల్ కేంద్రంలోనే నిర్మించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయ భవన సముదాయం జిల్లా కేంద్రానికి దూరంలో ఉం డటం మూలంగా రాకపోకల విషయంలో అందరికి అగచాట్లు తప్పడం లేదన్నారు. మహిళా ప్రాంగణం ప్రాంతంలో నిర్మిస్తే అవస్థలు అధిమవుతాయని పేర్కొన్నారు. స్పందించిన ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ బీజేపీ పార్టీ తరఫున బార్ అసోసియేషన్ల విజ్ఞప్తికి బహిరంగ మద్దతును ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్ పాటిల్, విఠల్ రెడ్డిలు సైతం మద్దతును వెల్లడించారు. బీఆర్ఎస్‌కు చెందిన ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్ పార్టీ తరఫున తమ మద్దతును బహిరంగంగా ప్రకటించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌కు పెద్దపీట

- ముథోల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్


కన్వీనర్‌కి కేక్ తినిపిస్తున్న ముథోల్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే

భైంసా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానికసంస్థల ఎన్నికల టికెట్ల కేటాయింపు ప్రక్రియలో యూత్ కాంగ్రెస్ శ్రేణులకు పెద్దపీట వేస్తామని ముథోల్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వెల్లడించారు. శనివారం భైంసాలో జరిగిన యూత్‌కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ శ్రేణులు స్థానిక సంస్థల సంగ్రామానికి పూర్తి స్థాయిలో సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా తమ తమ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో పాటుపడాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధి చేపట్టిన సంస్కరణలు, సాధించిన విజయాలు, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, పరిష్కరించిన సమస్యలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి వివరించి పార్టీని పటిష్ఠ పరచాలని ఆకాంక్షించారు. యూత్ కాంగ్రెస్ పనితీరు పైనే పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని వేడుకలను సంబరంగా జరుపుకున్నారు. ఇందులో యూత్ కాంగ్రెస్ ముథోల్ నియోజకవర్గ కన్వీనర్ మహ్మద్‌షఫీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, ఆయా మండలాల యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ సంఘాలు ఏకతాటి మీదికి రావాలి

నిర్మల్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర బీసీ సంఘాలు ఏకతాటి మీదికి రావాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీకులాల ఉద్యమ పోరాట సంఘం కన్వీనర్ కోడూరి చంద్రయ్య అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏర్పాటు చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించి తమవంతు ప్రయత్నం చేసిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పరంగా తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ 42 శాతం రిజర్వేషన్ బిల్లుల నుంచి ముస్లింలకు 10 శాతం తొలగిస్తే మేము బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి శక్తి సామర్థ్యాలను ఉపయోగించి నెరవేరుస్తామని అంటున్నారని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న దృశ్యం

కుబీర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కుబీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికయిన కళ్యాణ్‌ను శనివారం పార్టీ(కే) మాజీ సర్పంచ్ మెంచు పోశెట్టి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, బక్కన్న, దేవన్న తదితరులున్నారు.